సాక్షి నంద్యాల
శనివారం, 28 డిసెంబర్, 2024



## అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి శుక్రవారం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన జె.నాగేశ్వరరావు రూ.1,01,116 విరాళం అందజేశారు.



## భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సేవా సంకల్పాన్ని పఠించారు.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం (అడుగులు) | : 1,633 |
| ప్రస్తుతం | : 1,627.20 |
| సామర్థ్యం (టీఎంసీలు) | : 105.788 |
| ప్రస్తుతం | : 83.972 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 108 |
| అవుట్ ఫ్లో | : 8,549 |

## న్యూస్‌రీల్

### ప్రభుత్వ పథకాలను రైతులకు చేరవేయాలి

నంద్యాల(అర్బన్): వ్యవసాయ శాఖ అమలు పరుస్తున్న వివిధ పథకాల ప్రయోజనాలను రైతులకు చేరవేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్‌లో శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకులు సరళమ్మ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వీఏఏ, వీహెచ్‌ఏ, మండల ఏఓలకు నైపుణ్య సామర్థ్య పెంపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రైతులకు శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంతో కూడిన సలహాలు ఇచ్చి దిగుబడులు సాధించేందుకు దోహదపడాలన్నారు. శాస్త్రవేత్త చైతన్య మాట్లాడుతూ రైతులు పంటల తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణకు మందులు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు రాజశేఖర్, ఆంజనేయులు, విజయశేఖర్, రామ్మోహన్ రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

### పాత పద్ధతిలోనే రాయల్టీలు మంజూరు చేయాలి

బేతంచెర్ల: నాపరాయి గనులకు పాత పద్ధతిలోనే రాయల్టీలు మంజూరు చేయాలని ఫ్యాక్టరీ, ట్రాక్టర్, లారీ, గనులు యజమానులు డిమాండ్ చేశారు. శుక్రవారం బనగానపల్లె రైల్వే గేటు సమీపంలో వారు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అసలే వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాయల్టీలు మంజూరు కాకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం నాపరాతి పరిశ్రమపై విధించిన కన్సిడరేషన్ ఫీజును ఎత్తి వేసి పాత పద్ధతిలో రాయల్టీలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గనుల, ఫ్యాక్టరీ యజమానులు గుండా గోపాలు, తిరుమలేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, బాబు, మహేష్ రెడ్డి, ప్రశాంత్, రాంబాబు, జగదీష్, మహానంది, పాల్గొన్నారు.

### బుగ్గన్నపల్లి రైల్వే స్టేషన్ తనిఖీ



విద్యుత్ డబుల్ లైన్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న సీఆర్ఎస్ కమిషనర్ మాధవి

పాణ్యం/బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్‌ను సికింద్రబాద్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) కమిషనర్ మాధవి, సీపీఏ సత్య ప్రకాశ్, గుంతకల్ డీఆర్ఎం విజయకుమార్ తనిఖీ చేశారు. ఆధునీకరించిన బుగ్గనపల్లి స్టేషన్‌తో పాటు క్రిష్ణమ్మ కోన రైల్వే స్టేషన్ మీదు గా పాణ్యం రైల్వే స్టేషన్ వరకు 19.085 కిలోమీటర్ల మేర పూర్తైన కొత్త బ్రాడ్ గేజ్ విద్యుత్ డబుల్ లైన్‌ను పరిశీలించి రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తర్వాత క్రిష్ణమ్మ కోన, పాణ్యం రైల్వే స్టేషన్లతో పాటు రిలే రూమ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వే సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గుంతకల్ డివిజనల్ అధికారులు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

### చిన్న మొత్తాల పొదుపుతో అదనపు ఆదా

మహానంది: గ్రామీణ ప్రాంత ప్రజలు పోస్టాఫీసు పథకాల్లో చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకుని మంచి లాభాలు పొందవచ్చని కర్నూలు రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ వెన్నం ఉపేందర్ తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం శుక్రవారం ఆయన మహానందికి వచ్చారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం శ్రీనివాసులు స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్థానిక పోస్టాఫీసు వద్ద ఏర్పాటు చేసిన ఖాతాదారుల సమావేశంలో పీఎంజీ పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లల కోసం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ సత్యనారాయణ, పీఎస్ భాస్కర్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

### నిత్యం అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(అర్బన్): ఈవీఎంల గోదాముల వద్ద విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం టెక్కె మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాములకు వేసిన సీళ్లను, ఈవీఎంల రక్షణ, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేసి మాట్లాడారు. డీఆర్‌ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, ఎన్నికల విభాగపు తహసీల్దార్ జయప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సయ్యద్ రియాజ్ బాషా (కాంగ్రెస్), సాయిరాం రెడ్డి (వైఎస్సార్‌సీపీ), శివరామిరెడ్డి (టీడీపీ), నరసింహులు (సీపీఎం), కొసెట్టి చంద్రశేఖర్ (బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు..కరెంట్ బాదుడుపై నిరసన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, నేతలు



బనగానపల్లె..మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో పోరుబాట ర్యాలీ



నంద్యాల..విద్యుత్ చార్జీల పెంపు నిరసనలో మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్

# విద్యుత్ బాదుడుపై కదంతొక్కి.. నిరసన గళమెత్తి

కూటమి ప్రభుత్వం దగా పాలనపై ప్రజలు కన్నెర్రజేశారు. నిరసన గళం హోరెత్తించారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాటలో కదం తొక్కారు. బాబు డౌన్ డౌన్ అంటూ నినదించారు. సర్కారు కపటనీతిని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరు ఆపమని హెచ్చరించారు. ఆరునెలల్లో కూటమి సర్కారు రెండు సార్లు విద్యుత్ చార్జీల పెంచింది. దీనిపై వైఎస్సార్‌సీపీ శుక్రవారం చేపట్టిన పోరుబాట కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, పాణ్యం, శ్రీశైలం, నందికొట్కూరు, డోన్, బనగానపల్లె నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కల్లూరు నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరిన నాయకులు, ప్రజలు

- కరెంట్ చార్జీల పెంపుపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం
- భారీగా తరలి వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు
- కూటమి సర్కారు దగాపై కన్నెర్ర
- పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్
- విద్యుత్ అధికారులకు వినతి పత్రాల అందజేత
- జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ పోరుబాట విజయవంతం

నంద్యాల: కూటమి సర్కారు విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాట కార్యక్రమం విజయవంతమైంది. నంద్యాల పట్టణంలో మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబానగర్ ఆర్చ్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు సాగిన ర్యాలీలో వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ కార్యాలయంలో ఎస్‌ఈ సుధాకర్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ పోచా మాట్లాడుతూ అబద్ధపు హామీలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి ఆరునెలల్లో ఏకంగా రెండుసార్లు పెంచారన్నారు. మాజీ ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ చంద్రబాబు ఇష్టారాజ్యంగా కరెంట్ చార్జీలు పెంచి ప్రజలపై భారం వేయడం సరికాదన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టించి పేదలకు మేలు చేస్తామని చెప్పి ఇప్పుడు వారి సంపద పెంచుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ చంద్రబాబు మాయ మాటలు నమ్మి ప్రజలు ఓటేసి మోసపోయారన్నారు. వారి పక్షాన పోరాటాలు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, సైమాన్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పీపీ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, ప్రతాపరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, దాల్‌మిల్ అమీర్‌బాషా, కల్లూరు రామలింగారెడ్డి, చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

➤ బనగానపల్లె నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి పెట్రోల్ బంక్ సర్కిల్ మీదుగా కర్నూలు రహదారిలోని కరెంట్ ఆఫీసు వరకు పోరుబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచి బడుగు, బలహీన వర్గాల నడ్డి విరిచిందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ కూటమి సర్కారుపై వ్యతిరేకత మొదలైందన్నారు. దగా పడ్డామని ప్రజలు గ్రహించారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు గుండం శేషిరెడ్డి, పార్టీ అనుబంధ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➤ ఆళ్లగడ్డ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ డీఈని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ పెరిగిన కరెంట్ చార్జీలను చూసి ప్రజలు షాక్‌కు గురయ్యారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీలు నాయక్ వసీం, గజ్జెల రాఘవేంద్రారెడ్డి, అమర్నాథరెడ్డి, మండల కన్వీనర్లు కుమార్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, బత్తుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

➤ శ్రీశైల నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ట్రాన్స్‌కో కార్యాలయం వరకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీ విజయవంతమైంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి మాట్లాడుతూ పేదలకు గత ప్రభుత్వం అందించిన ఉచిత విద్యుత్‌ను దూరం చేయడమే కాకుండా వారిపై అదనపు చార్జీలు వేయడం ఘోరమన్నారు. ఈ నెలలో వచ్చిన విద్యుత్ బిల్లులు చూసి చిరువ్యాపారులు, గృహ వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఈశ్వర ప్రసాదరెడ్డి, సభ్యులు సంజీవ్, పార్టీ నాయకులు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి, అంబాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ బాలస్వామి, మాజీ రాష్ట్ర డైరెక్టర్ అంజాద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

➤ పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ డోన్ పట్టణంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి స్వగృహం నుంచి పాత బస్టాండ్ మీదుగా విద్యుత్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి విద్యుత్ ఏడీఏ నాగేంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు కూటమి సర్కారు మంగళం పాడటం దారుణమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు శివలక్ష్మి, బద్దుల రాజ్‌కుమార్, బోరెడ్డి శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➤ నందికొట్కూరు పట్టణంలో పటేల్ సెంటర్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ధార సుధీర్ ఆధ్వర్యంలో కరెంట్ చార్జీల బాదుడుపై విద్యుత్ పోరు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడూ మాటమీద నిలబడరన్నారు. గతంలో కూడా ప్రజలపై కరెంట్ చార్జీలు భారీగా పెంచి ఇబ్బందులకు గురిచేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు కోకిల రమణారెడ్డి, జెడ్పీటీసీలు జగదీశ్వరరెడ్డి, సోమల సుధీర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



విద్యుత్‌చార్జీల బాదుడుపై ఎస్‌ఈ ఉమాపతికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు

### నమ్మించి దగా చేసిన బాబు

➤ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ బాదుడుపై నిరసన హోరెత్తింది. పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరులోని ఆయన కార్యాలయం నుంచి బళ్లారి చౌరస్తా మీదుగా కరెంట్ ఆఫీసు వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పెంచిన చార్జీలను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఎస్‌ఈ ఉమాపతిని కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు కాటసాని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఊరూరా తిరిగి విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు చేస్తున్నదేమిటో చెప్పాలన్నారు. అధికారం కోసం నాడు మాయమాటలు చెప్పారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే జనం జేబులకు చిల్లులు పెట్టి దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కర్నూలు మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ.. మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన



నందికొట్కూరు..విద్యుత్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న ఇన్‌చార్జ్ ధారసుధీర్, నాయకులు



డోన్.. కూటమి సర్కారు దగాపై నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

### విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీఓ వెంకటశివప్రసాద్

మహానంది: గిరిజన పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీఓ వెంకట శివప్రసాద్ హెచ్చరించారు. గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలకు తాళం వేసి ఉండటంతో ఆరా తీసి వివరాలు సేకరించారు. ఉపాధ్యాయుడు సుమంత్ మరో పాఠశాలలో ఉన్నట్లు తెలుసుకున్న పీఓ పిలిపించి మందలించారు. తనకు సమాచారం అందించకుండా తాళాలు ఎలా వేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరణ కోరుతూ ఉపాధ్యాయుడికి మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

## అటవీ సంరక్షణ అందరి బాధ్యత

- అధికారులతో జిల్లా కలెక్టర్

శిరివెళ్ల: అటవీ సంపద సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం పచ్చర్ల ఎకో టూరిజం క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాతో కలిసి జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్యప్రాణులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బనగానపల్లె రేంజ్ మంగంపేట తండాలో ఉన్న ఫారెస్ట్ భూములను పేద ప్రజలకు డీ-పట్టాల రూపంలో ఇవ్వడంపై అటవీ అధికారులు అభ్యంతరాలు తెలపడంతో రెవెన్యూ అధికారులతో చర్చించి తగు పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని పెచ్చేరువు గూడెంకు సంబంధించిన గిరిజనులకు 2020 సంవత్సరంలో డీ-పట్టాలిచ్చారని సాగు చేసుకునేందుకు వారికి అనుమతులు ఇవ్వాలన్నారు. అటవీ సంపద స్మగ్లింగ్ కాకుండా పోలీసు, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, నంద్యాల, ఆత్మకూరు అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు నాగమనేశ్వరి, సాయిబాబా, అనురాగ్ మీనా, అబ్దుల్ రవూఫ్, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

### విపత్తు నివారణకు ప్రణాళిక

నంద్యాల: ప్రకృతి వైపరీత్యాల నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని వాగులు ఉప్పొంగడంతో గ్రామాల మధ్య రహదారుల రాకపోకలు నిలిచిపోయాయన్నారు. జిల్లాలో 21 వాగులు 54 గ్రామాల రహదారులకు అనుసంధానమై ఉన్నాయని వాటి పటిష్టతకు చర్యలు తీసుకోవాలన్నారు. వాగుల చుట్టు ఉన్న స్థలాలు ఆక్రమణలకు గురికావడంతో భారీ వర్షాలు కురిసినా, వరదలు వచ్చినా నంద్యాల పట్టణం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీశైలం వెళ్లే దారిలో కొండ చరియలు విరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, దీనిపై దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్, స్పెషల్ డీసీలు, ఆర్డీఓలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు మెమో జారీ

**తుగ్గలి:** ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనల ప్రకారం ఏ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనరాదు. ఎంపీడీఓ ఆఫీసు ఉద్యోగులు గురువారం పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే లేకపోయినా కేక్ కట్ చేసి అత్యుత్సాహం ప్రదర్శించడం చర్చనీయాంశమైంది. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్‌ఎం బాషా, ఉపాధి, వెలుగు సిబ్బంది కలిసి కేక్ కట్ చేయడం పలు విమర్శలకు తావిచ్చింది. విషయం తెలుసుకున్న జెడ్పీ సీఈఓ.. ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు మెమో జారీ చేసినట్లు తెలిసింది.

### విపత్తులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

**ఆలూరు రూరల్:** విపత్తులు, అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని జిల్లా విపత్తుల స్పందన, అగ్నిమాపక అధికారి అవినాష్ జయసింహా సూచించారు. శుక్రవారం ఆయన ఆలూరు అగ్నిమాపక కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. వరదలు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించాలన్నారు. పెట్రోల్ బంకులు, సినిమా థియేటర్లు, చిన్న, పెద్ద పరిశ్రమలు, షాపింగ్ మాల్స్‌ను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. ఆలూరు ఫైర్ స్టేషన్‌లో వాటర్ సంపు మరమ్మతులు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. అంతకు ముందు ఫైర్ సిబ్బందికి ఫిట్‌నెస్ పరీక్షించి మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లాలో మొత్తం 6 ఫైర్ స్టేషన్లు ఉండగా ఇందులో 30 ఫైర్ మెన్ పోస్టులు, 6 డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆలూరు మినహా అన్ని ఫైర్ స్టేషన్లలో వాటర్ సంపులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఆయన వెంట ఆలూరు ఫైర్ స్టేషన్ అధికారి ఎస్‌హెచ్‌బీ ఖాద్రీ ఉన్నారు.

### కోలుకోలేక యువకుడి మృతి

**డోన్ టౌన్:** పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సూరి (18) కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన చిన్ననాయుడు కుమారుడు సూరి ఇటీవల స్నేహితులతో కలిసి గ్రామంలో కోళ్ల దొంగతనానికి పాల్పడ్డాడు. విషయం గ్రామస్తులకు తెలియడంతో అవమానంగా భావించి ఈనెల 25న మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగుతూ సెల్ఫీ ఫొటో స్నేహితులకు పంపాడు. వారు ఘటనా స్థలానికి చేరు కుని అపస్మారక స్థితిలో ఉన్న సూరిని స్థానిక వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. అక్కడ కో లుకోలేక మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



గౌరవ వందనం చేస్తున్న క్రీడాకారులు




మాట్లాడుతున్న ఎంజేపీ డిప్యూటీ సెక్రటరీ సుభాషిణి దేవమ్మ



తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

**బేతంచెర్ల:** ప్రతి ఒక్క క్రీడాకారుడు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడాలని ఎంజేపీ డిప్యూటీ సెక్రటరీ సుభాషిని దేవమ్మ, జిల్లా కన్వీనర్ ఫ్లోరమ్మ, ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోరుమానుకొండ ఎంజేపీ ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులుగౌడు ఆధ్వర్యంలో కర్నూలు, నంద్యాల, కడప జిల్లా జోనల్ స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ ఆటల పోటీల్లో రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. క్రీడా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం కబడ్డీ, ఖోఖో హ్యాండ్‌బాల్, వాలీబాల్, చెస్, టెన్నికాయిట్, షటిల్ పోటీలను ప్రారంభించారు.

# రవాణా సేవలు ప్రైవేట్‌పరం చేయొద్దు



ఆర్‌టీఓకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

**కర్నూలు:** రవాణా శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆలోచనను విరమించుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌టీఓ భరత్ చౌహాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆర్‌టీఓ కార్యాలయంలో జరుగుతున్న ఈ–కేవైసీ మండల మ్యాపింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, కార్యదర్శి హుసేన్ వలి, కె.రవి తదితరులతో కూడిన ప్రతినిధి బృందం మాట్లాడుతూ.. రవాణా రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నగర నాయకులు మాలిక్ బాషా, నబి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొబ్బరి ఉత్పత్తులతో రైతులకు మేలు




మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

**నంద్యాల(అర్బన్):** వేరు నుంచి కాయ, పీచు వరకు కొబ్బరి ఉత్పత్తులు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయని తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ తిరుపతిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో శుక్రవారం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో శాస్త్రీయ కొబ్బరి సాగుపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కొబ్బరి ఉత్పత్తులు ఉపయోగకరమని, కొబ్బరి సాగులో విత్తన ఎంపికే కీలకమన్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు డెవలప్‌మెంట్ ఆఫీసర్ శరత్ మాట్లాడుతూ కొబ్బరి సాగులో చీడపీడల నివారణ ప్రధానమన్నారు. హార్టికల్చర్ అధికారి నాగరాజు మాట్లాడుతూ కొబ్బరి సాగు రైతులు ఎకరాకు 60 మొలకలు నాటితే మంచి దిగుబడులు సాధించుకోవచ్చన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఉద్యానవన శాఖ ద్వారా అందించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకుంటూ కొబ్బరి సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అధికారులు కొబ్బరి అభివృద్ధి బోర్డు డీడీ కుమారవెల్, కిరణ్‌కుమార్, సత్యనారాయణ, హెచ్‌ఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి సరఫరాలో స్పష్టత ఇవ్వలేదు

- ఏఈ శ్రీనివాస నాయక్



కేసీ కాల్వ వివరాలు వెల్లడిస్తున్న ఏఈ శ్రీనివాస నాయక్

**జూపాడుబంగ్లా:** కర్నూలు–కడప కాల్వ కింద సాగుచేసిన రబీ పంటలకు ఎప్పటి నుంచి ఎప్పటి దాకా సాగునీరు సరఫరా చేస్తారో ఉన్నతాధికారులు తమకు స్పష్టత ఇవ్వలేదని, ఆ విషయం ఉన్నతాధికారులకే తెలుసని కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏఈ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాంలో కేసీ కాల్వ వాటాగా 10 టీఎంసీలు కేటాయించగా అందులో 3 టీఎంసీలు అనంతపురం తాగునీటికి మళ్లిస్తే కేవలం కేసీ కాల్వకు 7 టీఎంసీల నీళ్లు మిగులుతాయన్నారు. తుంగభద్ర డ్యాం వద్ద 7 టీఎంసీల నీటిని విడుదల చేస్తే కేసీ కాల్వకు కేవలం 3 టీఎంసీల నీళ్లు మాత్రమే చేరతాయన్నారు. దీంతో 3 టీఎంసీల నీటిని మార్చి దాకా ఎలా విడుదల చేస్తారనే విషయం ఉన్నతాధికారులకే తెలుసని ఏఈ వెల్లడించారు. శ్రీశైలం డ్యాంలో 854 అడుగుల నీటిమట్టం చేరే వరకు ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల ద్వారా కేసీ కాల్వకు సాగునీటిని విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల ద్వారా కేసీ కాల్వకు విడుదల చేస్తున్న నీరు కౌంటింగ్ అవుతుందని ఏఈ వెల్లడించారు. ఏబీఆర్ కాల్వకు సాగునీరు సరఫరా చేయాలని తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి ఏఈని కోరగా.. ఏబీఆర్ కాల్వ కింద నానాయకట్టు ఉందని, వందల ఎకరాల్లో సాగుచేసిన నానాయకట్టుకు సాగునీరు ఇవ్వటం వీలుకాదని ఏఈ తెలిపారు.

### ఆహార కల్తీ వ్యాపారులకు జరిమానా

**కర్నూలు(హాస్పిటల్):** ఆహార కల్తీ చేయడంపై జిల్లాలో పలువురు వ్యాపారులపై జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య జరిమానా విధించారు. ఇటీవల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్ ఆధ్వర్యంలో ఆహార భద్రత సిబ్బంది జిల్లాలోని పలు వ్యాపార దుకాణాలపై దాడులు నిర్వహించి శాంపిల్స్ సేకరించారు. ఇందులో ఆరు నాసిరకం, ఒకటి ఎక్స్‌పైరీ తేదీ దాటిన కూల్‌డ్రింక్స్ విక్రయం, రెండు వంటనూనెను తిరిగి మరిగించడం(టీపీసీ) కేసులు ఉన్నాయి. ఇందులో నాసిరకం ఆహార పదార్థాలు విక్రయించిన ఆదోని బెస్ట్ బేకరీ స్వీట్స్ షాప్‌నకు రూ.30 వేలు, పత్తికొండ బాలాజీ బిస్కట్ షాప్‌నకు రూ.20 వేలు, ఆదోని విశాల్ మెగా మార్ట్‌కు రూ.50 వేలు, ఎమ్మిగనూరు శ్రీసాయి కేక్ ప్యాలెస్‌కు రూ.30 వేలు, మోర్ సూపర్ మార్కెట్‌కు రూ.20 వేలు, సికింద్రాబాద్‌లోని ఆహార పదార్థాల ఉత్పత్తిదారునికి రూ.50 వేలు, సూర్యోదయ సూపర్ మార్కెట్‌కు రూ.10 వేలు, కర్నూలులోని నాగేంద్రనగర్ అభయాంజనేయ ఏజెన్సీస్‌కు రూ.10 వేలు, గణేష్ నగర్‌లోని వై. నీలావతమ్మ టిఫిన్ సెంటర్‌కు రూ.1000, చల్లా ఫుడ్ కోర్ట్‌కు రూ.2,500 జరిమానా విధించారు.

### రైలు ఢీకొని గొర్రెల కాపరి దుర్మరణం



మృతిచెందిన కురువ శంకర్

**పాణ్యం:** మండల పరిధిలోని కందికాయపల్లె, కృష్ణమ్మ కోన సమీపంలో శుక్రవారం రైలు ఇంజిన్ ఢీకొని గొర్రెల కాపరి కురువ శంకర్ (35) మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన రామాంజనేయులు కుమారుడు శంకర్ గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మేకలు మేపుకోవడానికి కొండకు వెళ్లాడు. రైలు ట్రాక్ దాటుతున్న సమయంలో నూతనంగా నిర్మిస్తున్న ట్రాక్‌ను పరిశీలించేందుకు వచ్చిన సేఫ్టీ రైలు ఇంజిన్ ఢీకొంది. ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

### ప్రైవేటు ఆసుపత్రులకు నోటీసులు

**కర్నూలు(హాస్పిటల్):** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులకు అగ్నిమాపక శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల గత నవంబర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని ఓ హాస్పిటల్‌లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి పలువురు మృతి చెందిన ఘటనను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లోని ఏసీ గదుల్లో స్మోక్ డిటెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి, లిఫ్ట్ వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిప్రమాదం జరిగినప్పుడు రోగులను ఎలా బయటకు పంపించాలి, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి నోటీసులో వివరించారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

### నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

**కర్నూలు(అర్బన్):** జిల్లా పరిషత్ మినీ సమావేశ మందిరంలో శనివారం జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏడు స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాల చైర్‌పర్సన్లు, సభ్యులు, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వివిధ శాఖలకు చెందిన అధికారులు తమకు కేటాయించిన నిర్ణీత సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యాన్ని చూపుతున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి

**ఎమ్మిగనూరురూరల్:** అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మంత్రాలయం చెట్నేపల్లి – కల్లుదేవకుంట క్రాస్ రోడ్డు వద్ద ఎక్సైజ్, కర్నూలు టాస్క్ ఫోర్స్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడుకు చెందిన కురవ పాపయ్య బైక్‌పై కర్ణాటక మద్యంతో పట్టుబడ్డాడన్నారు. అతడిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళకు అరుదైన కిడ్నీ ఆపరేషన్



రమణమ్మతో యురాలజీ విభాగం వైద్యుల బృందం

**కర్నూలు(హాస్పిటల్):** కిడ్నీపైన ఉండే అడ్రినల్ గ్రంథిలో ఏర్పడిన కణితిని తొలగించి ఓ మహిళకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల యురాలజీ విభాగం వైద్యులు అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. వివరాలను శుక్రవారం యురాలజీ విభాగంలో హెచ్‌ఓడీ డాక్టర్ సీతారామయ్య వెల్లడించారు. వైఎస్‌ఆర్ జిల్లా కడపలోని ఇందిరానగర్‌కు చెందిన రమణమ్మ(49) ఏడాది నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. అక్కడి రిమ్స్ హాస్పిటల్‌లో చూపించగా డాక్టర్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేశారు. ఈనెల 10న ఆసుపత్రిలో చేర్చుకుని కిడ్నీపైన అడ్రినల్ గ్రంథిలో, రక్తనాళాల మధ్య, కాలేయానికి ఆనుకుని 8 సెం.మీ ఉన్న కణితి ఉన్నట్లు పరీక్షల ద్వారా గుర్తించారు. ఆమె అధిక బరువు ఉండటం, బీపీ అధికంగా ఉండటంతో ఎండోక్రైనాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ పి. శ్రీనివాసులు సూచనల మేరకు ఈనెల 13న హెచ్‌ఓడీ డాక్టర్ సీతారామయ్య ఆధ్వర్యంలో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి కణితిని తొలగించారు. ఆపరేషన్ నిర్వహించిన వారిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిత్యశ్రీ, డాక్టర్ బాలరవితేజ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మహేష్‌నాయక్, అనెస్తీషియా వైద్యులు డాక్టర్ మురళీప్రభాకర్, డాక్టర్ స్వాతి, పీజీలు హిమజ, లయాక్ ఫాతిమా, ఉమామహేశ్వర రెడ్డి, ప్రశాంత్‌బాబు, సుదీప్, రవీంద్ర ఉన్నారు.

# జీహెచ్2 సోలార్ కంపెనీతో ట్రిపుల్ ఐటీ డీఎం ఒప్పందం

**కర్నూలు సిటీ:** ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్(ట్రిపుల్ ఐటీడీఎం)తో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బీజ్లీ యోజనలో భాగంగా సెకీ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ డీఎం క్యాంపస్‌లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు శుక్రవారం ఒప్పందాలు చేసుకున్నారు. ట్రిపుల్ ఐటీ డీఎంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇరువురు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందం కింద 500 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ను క్యాంపస్‌లోని భవనాలు, షెడ్లపై భాగంలో సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ రిజిస్ట్రార్ కె.గురుమూర్తి, జీహెచ్2 కంపెనీ ప్రతినిధులు కృష్ణమూర్తి(ఎలక్ట్రికల్ ఇంజినీర్), శ్రీనాథ్(సివిల్ ఇంజినీర్), జి.కె విజయానంద్(కన్సల్టెంట్ ఇంజినీర్), ఆచార్యులు సత్యబాబు, అక్తర్ ఖాన్, రవికుమార్‌లు పాల్గొని ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ సోలార్ ఒప్పందాల ద్వారా క్యాంపస్‌లో పునరుత్పత్తి శక్తి, వినియోగాన్ని విస్తరించి, క్యాంపస్‌కు ఆ శక్తి సామర్థ్యాలను పెంచడం లక్ష్యమన్నారు. కర్నూలులో సోలార్ ఎనర్జీ రంగంలో ఒక ముఖ్యమైన ముందడుగు వేసినట్లు చెప్పారు.

### సారా స్థావరాలపై దాడులు



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

**అవుకు:** నాటుసారా తయారీ చట్టరీత్యా నేరమని ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధనాదేవి అన్నారు. శుక్రవారం అవుకు మండలంలోని కొండమనాయుని పల్లె,పిక్కర్లపల్లితండా గ్రామాల్లో సారా స్థావరాలపై దాడులు నిర్వహించామని తెలిపారు. రెండు గ్రామాల్లో సారా తయారీ బట్టీలను ధ్వంసం చేసి 2500 లీటర్ల బెల్లం ఊటను పారబోశామన్నారు. అలాగే తయారీకి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బట్టీల వద్ద 25 లీటర్ల సారాను సీజ్ చేశామని పేర్కొన్నారు. ఎస్‌ఐలు కమలాకర్, మధుసుదనరెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య



రంగస్వామి(ఫైల్)

**డోన్ టౌన్:** పట్టణంలోని కొండపేటకు చెందిన మంగలి రంగస్వామి (23) కుటుంబ కలహాలతో శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భవతిగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### డీఎంహెచ్‌వో బాధ్యతల స్వీకరణ

**కర్నూలు(హాస్పిటల్):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి(డీఎంహెచ్‌వో)గా డాక్టర్ పి. శాంతికళ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ ఎల్.భాస్కర్ బాధ్యతలు అప్పజెప్పారు. డాక్టర్ పి.శాంతికళ తిరుపతి స్వస్థలం. ఆమె ఎంబీబీఎస్ 1986 బ్యాచ్‌లో స్విమ్స్‌లో చదివారు. అనంతరం 1995 నుంచి 1997 వరకు కర్నూలు మెడికల్ కాలేజీలో డీజీవోగా పీజీ చేశారు. 1998లో అప్పటి కడప జిల్లా రైల్వేకోడూరు పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరి పలు చోట్ల విధులు నిర్వర్తించారు. అనంతరం 2015 నుంచి 2018 వరకు సిద్దార్థ మెడికల్ కాలేజి(విజయవాడ)లో ఎస్‌పీఎం పీజీ చదివారు. ఆ తర్వాత జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా 2018 నుంచి ఇప్పటి వరకు విధులు నిర్వహించారు. పదోన్నతుల్లో భాగంగా సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది కర్నూలుకు బదిలీ అయ్యారు.

### ఆకతాయిలకు 30 రోజుల జైలు శిక్ష

**నంద్యాల(వ్యవసాయం):** మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి శుక్రవారం 30 రోజులు జైలు శిక్షను ఖరారు చేసినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. నందమూరినగర్ చౌరస్తాలో బైటిపేటకు చెందిన వడ్ల రాజశేఖర్, చాకలి మధురాజు, పెద్ద మాతాంగి లక్ష్మయ్య మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో తాలూకా పోలీసులకు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి విచారణ జరిపి ఒక్కొక్కరికి 30 రోజులు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.



# దేవస్థాన ఉద్యోగులకు పదోన్నతులు



శ్రీశైల దేవస్థాన ఈఓను కలిసిన పదోన్నతి పొందిన ఉద్యోగులు

**శ్రీశైలంటెంపుల్:** పలువురు ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షకులు కె.వెంకటేశ్వరరావు, కె.సాయికుమారికి సహాయ కార్యనిర్వహణాధికారిగా పదోన్నతి పొందారు. సీనియర్ అసిస్టెంట్లు హరికృష్ణారెడ్డి, రంగన్న, నాగేశ్వరరావు, ఆర్.మల్లికార్జున, ఎం.శ్రీనివాసరావులకు పర్యవేక్షకులుగా పదోన్నతులు లభించాయి. పదోన్నతులు పొందిన ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పదోన్నతి పొందిన ఉద్యోగులు మర్యాదపూర్వకంగా దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# సహకార సంఘాల సభ్యులకు ఈ–కేవైసీ తప్పనిసరి

**కర్నూలు(అగ్రికల్చర్):** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) సభ్యులైన రైతులందరు ఈ–కేవైసీ చేయించుకోవాలని జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల కింద లబ్ధి చేకూరాలన్నా, డీబీటీ ద్వారా నగదు బదిలీ జరగాలన్నా, ఇతర ప్రయోజనాలు పొందాలన్నా ఈ–కేవైసీ తప్పని సరి అన్నారు. జిల్లాలోని 43 పీఏసీఎస్‌లలో 73,462 మంది రైతులు రుణాలు తీసుకొని సభ్యులుగా ఉన్నారన్నారు. సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేసి మినీ బ్యాంకులుగా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో రైతుల ఈ–కేవైసీకి ప్రాధాన్యత పెరిగిందన్నారు. గ్రామ సచివాలయాల్లో ఈ–కేవైసీ చేయించుకునే అవకాశాన్ని సహకార శాఖ కల్పించిందని, రైతులు ఆధార్ కార్డుతో సచివాలయానికి తీసుకెళ్లి ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు 14 వేల మంది రైతులు మాత్రమే ఈ–కేవైసీ చేయించుకున్నారన్నారు.

**31లోగా ఈ–కేవైసీ చేయించుకోండి**

పసుపల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులుగా ఉన్న రైతులు ఈనెల 31లోగా ఈ–కేవైసీ చేయించుకోవాలని ముఖ్య కార్యనిర్వహణ అధికారి మురళీధర్ చౌదరి తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా సహకార కేంద్రబ్యాంక్‌లో విలేకరులతో మాట్లాడారు. సంఘంలో 3 వేలకుపైగా రైతులు సభ్యులుగా ఉన్నారని, సొసైటీని కంప్యూటరీకరణ చేస్తున్నందున సభ్యులు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

# షాద్‌నగర్‌లో చోరీ చేసి.. డోన్‌లో వదిలేసి!


- ఇంట్లో నగదు, నగలు లేకపోవడంతో కారును చోరీ చేసిన దుండగుడు
- టోల్ ప్లాజ్ వద్ద ఫాస్ట్‌ట్యాగ్ మెసేజ్‌తో యజమాని అప్రమత్తం



డోన్‌లో వదిలి వెళ్లిన కారు

**డోన్ టౌన్:** ఓ దొంగ ఇంట్లోకి చోరీకి వెళ్లాడు అంతా గాలించినా ఏమీ దొరకలేదు. చివరికి టేబుల్‌పై కారు తాళాలు కనిపించాయి. వాటితో కారును తీసుకుని కర్నూలు వైపు బయలుదేరాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటపడే సరికి డోన్ వరకు వచ్చి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వదిలేసి పరారయ్యాడు. తెలంగాణ సీసీఎస్ పోలీసు మమ్మద్‌జాకీర్ తెలిపిన వివరాలు.. ఈనెల 25న గుర్తుతెలియని దుండగుడు షాద్‌నగర్‌లోని ఓ ఇంటిలోకి చొరబడ్డాడు. ఆభరణలు, డబ్బు ఏమీ దొరక్కపోవడంతో టేబుల్‌పై ఉన్న తాళాలు తీసుకుని బయట పార్కు చేసి ఉంచిన కియా కంపెనీ కారు టీ 07 హే 3456 నంబరు కారుతో కర్నూలు వైపు బయలుదేరాడు. టోల్ గేట్ క్రాస్ చేసిన సమయంలో ఫాస్ట్ ట్యాగ్ నుంచి డబ్బు కట్ అయ్యినట్లు యజమాని సెల్‌కు మెసేజ్ వెళ్లడంతో ఆయన అప్రమత్తమైన తన సెల్ ఫోన్‌లో ఇంటి సీసీ కెమెరా పరిశీలించి కారు చోరీ అయినట్లు గుర్తించి షాద్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వెంటనే ముందున్న టోల్ ప్లాజ్ సిబ్బందికి సమాచారం ఇచ్చి కారును ఆపాలని ఆదేశించారు. మరో టోల్ ప్లాజా సిబ్బంది కారును ఆపే ప్రయత్నం చేస్తుండగా దొంగ కారును రెండవ టోల్ ప్లాజాలోకి వెళ్లకుండా ఒక్కసారిగా వెనక్కి వెళ్లి పోలీసులకు చిక్కకుండా పరారయ్యాడు. రంగంలోకి దిగిన సీసీఎస్ పోలీసులు జాతీయ రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. జీపీఎస్ ఆధారంగా డోన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పార్కు చేసి ఉంచినట్లు శుక్రవారం గుర్తించారు. తెలంగాణా సీసీఎస్ పోలీసులు డోన్‌కు చేరుకుని స్థానిక పోలీసుల సహకారంతో నంద్యాల జిల్లా క్లూస్ టీంను రప్పించి దుండగుల వేలి ముద్రలు సేకరించుకున్న అనంతరం కారును షాద్ నగర్‌కు తీసుకెళ్లారు.

# విద్యుత్ ప్రమాదంలో బాలుడి మృతి



షంసుద్దీన్ (ఫైల్)

**సి.బెళగల్:** మండలంలో ని గొల్లలదొడ్డి గ్రామాని కి చెందిన బాలుడు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన నబి, మున్నీ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా, పెద్ద కుమారుడు షంసుద్దీన్ (16)ను హైదరాబాద్‌లో బంధువుల వద్ద ఉంటున్నాడు. శుక్రవారం బంధువుల ఇంట్లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో షంసుద్దీన్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలినట్లు గ్రామస్తులు తెలిపారు.